క్లుప్తంగా

రైతుల అవసరాలు తీర్చేందుకే యంత్రసేవ

ఎమ్మెల్యే రక్షణనిధి



గంపలగూడెం: రైతుల వ్యవసాయ అవసరాలను తీర్చేందుకే వైఎస్సార్ యంత్రసేవా పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు పరుస్తోందని ఎమ్మెల్యే కే. రక్షణనిధి తెలిపారు. మండలంలోని కొత్తపల్లి సీహెచ్‌సీ గ్రూపునకు మంజూరైన వరి కోతయంత్రాన్ని ఆయన మంగళవారం గంపలగూడెం రైతు భరోసా కేంద్రం వద్ద అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీహెచ్ సీ గ్రూపులద్వారా సబ్సిడీపై రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, వరికోత యంత్రాలను అందజేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆర్బీకేలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తర్వాత 50శాతం సబ్సిడీపై విత్తనాల పంపిణీని ఆయన ప్రారంభించారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ



జి.కొండూరు: ప్రమాదవశాత్తూ లారీపై నుంచి జారిపడి మృతి చెందిన చెర్వుమాధవరం గ్రామ పంచాయతీ మాజీ సర్పంచ్ బత్తుల ప్రసాద్ కుటంబాన్ని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. అదేవిధంగా గడ్డమణుగులో వైఎస్సార్ సీపీ నాయకుడు ఉమ్మనేని బల్లయ్య తండ్రి కృష్ణారావు ఇటీవల మృతిచెందిన క్రమంలో ఆయన కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు.

వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాలకు సంక్షేమం

మైలవరం: వైఎస్సార్ సీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమం సాధ్యమైందని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ మంగళవారం తెలిపారు. వైఎస్సార్ మత్స్యకార భరోసా కింద మొత్తం 1,23,519 మంది మత్స్యకార కుటుంబాలకు రూ.123.52కోట్లుతో పాటు ఓఎన్‌జీసీ పైపులైన్ ఏర్పాటుతో జీవనోపాధి కోల్పోయిన 23,458మంది మత్స్యకారులకు కూడా రూ.108కోట్లు సాయం సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. వేట నిషేధ భృతిని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టినందుకు ప్రజలు తరపున ఎమ్మెల్యే వసంత కృతజ్ఞతలు తెలిపారు.

జాబ్ మేళా సద్వినియోగం చేసుకోండి

తిరువూరు: తిరువూరులో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న మెగా జాబ్ మేళా జరుగుతుందని ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ, పలు ఎంఎన్‌సీ కంపెనీలలో టెక్నికల్, నాన్ టెక్నికల్ ఉద్యోగాల భర్తీకి తిరువూరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తిరువూరు ప్రాంత నిరుద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా ప్రభుత్వం ఈ జాబ్‌మేళా నిర్వహిస్తోందని పేర్కొన్నారు. పదో తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ, బీఈడీ, పీజీ, ఐటీఐ, డిప్లొమా, బీటెక్, ఫార్మసీ తదితర కోర్సులు చేసిన నిరుద్యోగులకు ఈ మేళా ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. తిరువూరు, విస్సన్నపేట, నూజివీడు, మైలవరం, విజయవాడ, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల్లో ఉద్యోగావకాశాలున్నాయని తెలిపారు.

నేడు, రేపు రాయనపాడు లెవల్ క్రాస్ గేటు మూసివేత

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విజయవాడ రైల్వే డివిజన్‌లోని రాయనపాడు–కొండపల్లి మధ్య అత్యవసర ట్రాక్ మరమ్మతు పనుల కారణంగా లెవల్ క్రాస్ గేటు నెంబర్ 140ను ఈ నెల 16, 17 తేదీలలో మూసి వేస్తున్నట్లు గతంలో అధికారులు ప్రకటించారు. ఈ సెక్షన్ మధ్య పనులు కొంత అలస్యం కావడంతో ఈ నెల 17 ఉదయం 7 గంటల నుంచి 18వ తేదీ సాయంత్రం ఐదు గంటల వరకు లెవల్ క్రాస్ గేటును మూసివేస్తున్నట్లు సీనియర్ సెక్షన్ ఇంజనీర్ తెలిపారు.

పరిశుభ్రతతోనే వ్యాధుల నిర్మూలన

జి.కొండూరు: ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం వలన దోమల ఉధృతి తగ్గి జ్వరాలను అదుపు చేసుకోవచ్చని మండల వైద్యాధికారి డాక్టర్ శ్రీ కల్యాణి అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మునగపాడు గ్రామంలో అవగాహనా ర్యాలీని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పగడాల వెంకటేశ్వరరావు, పీఏసీఎస్ చైర్మన్ చుండూరు విష్ణువర్ధన్‌రావు, వైఎస్సార్ సీపీ నాయకుడు రమావతు శ్రీను పాల్గొన్నారు.

నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి

నూజివీడు: ఇంటి పరిసరాల్లో మంచినీరు నిల్వ ఉండకుండా చూసుకుంటే డెంగీ జ్వరాన్ని నియంత్రించొచ్చని గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి పి.శ్రీనివాస్ గౌతమ్ అన్నారు. జాతీయ డెంగీ దినం సందర్భంగా గొల్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో గ్రామంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, పద్మావతి, హెల్త్ అసిస్టెంట్‌లు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

డెంగీపై అవగాహన అవసరం

నూజివీడు: డెంగీ జ్వరం వ్యాప్తి చెందే విధానం గురించి ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉంటే, దానిని సులువుగా నివారించవచ్చని పీపీ యూనిట్ వైద్యాధికారి గంగాధరకుమార్ అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవంను పురస్కరించుకొని పట్టణంలోని పీపీ యూనిట్, మలేరియా యూనిట్, పట్టణ ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల ఆధ్వర్యంలో డేంగీపై అవగాహన ర్యాలీని నిర్వహించారు. పీపీ యూనిట్ వైద్యాధికారి సాయిసుధ, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు సౌమ్య, సుష్మ, సబ్ యూనిట్ అధికారి యలమంద, సూపర్‌వైజర్ మంగాయమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



మునగపాడులో అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్న వైద్యాధికారులు



నూజివీడులో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

డెంగీని నిర్మూలిద్దాం

చాట్రాయి: పరిసరాల పరిశుభ్రతతోనే డెంగీని నిర్మూలించవచ్చని పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనవాస రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చాట్రాయి సెంటర్లో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ఆయన మాట్లాడారు.

దోమకాటుకు గురికావద్దు

తిరువూరు: దోమకాటుతో అనారోగ్యం బారిన పడే ప్రమాదం ఉన్నందున తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తూ తిరువూరులో ఆరోగ్యకార్యకర్తలు మంగళవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. జాతీయ డెంగీ దినోత్సవ సందర్భంగా అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో ఏరియా ఆస్పత్రి నుంచి బోస్ సెంటర్ వరకు ప్రదర్శన జరిపారు. అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి ఎం కృపారాణి, హెల్త్ విజిటర్ పద్మావతి, హెల్త్ సూపర్‌వైజర్ కే రవి, ఆరోగ్య, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో..

రెడ్డిగూడెం: రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డెంగీ వ్యాధి నివారణపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు సందేష్, చెన్నకేశవ మాట్లడుతూ దోమలు ప్రబలకుండా ఇంటి పరిసరాలను ప్రతిరోజు శుభ్రం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో శ్యాం సుందరరావు, లక్ష్మీ, హెల్త్ విజిటర్ భవానీ పాల్గొన్నారు.

దోమల నివారణ అందరి బాధ్యత

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సమాజంలో దోమల నివారణ ప్రతి ఒక్కరి బాధ్యత అని యూపీహెచ్‌సీ వైద్యురాలు శ్రావ్యపూర్ణిమ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా కొండపల్లిలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

ఆగిరిపల్లి: డెంగీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలని ఆగిరిపల్లి పీహెచ్‌సీ వైద్యధికారి జె.జగన్‌మోహనరావు అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీ ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన ర్యా లీ నిర్వహించారు. ర్యాలీలో తహసీల్దార్ ఉదయ్‌భాస్కరరావు, ఎంపీడీఓ వాణి, పీహెచ్‌సీ సిబ్బంది, ఇన్‌చార్జ్ ఈఓపీఆర్డీ ప్రాసాద్, సీహెచ్‌ఓ లక్ష్మయ్య, పాల్గొన్నారు.

ముసునూరులో..

ముసునూరు: డెంగీని అంతమొందించేందుకు దోమల నిర్మూలనకు కృషి చేయాలని వైద్యాధికారి కిరణ్ కుమార్ పేర్కొన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా పీహెచ్‌సీల వైద్యాధికారులు కరీముల్లా, అవినాష్ ఆధ్వర్యంలో ముసునూరు, రమణక్కపేటలలో అవగాహన ర్యాలీలు మంగళవారం నిర్వహించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

పుల్లూరు(మైలవరం): వైఎస్సార్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ప్రవేశపెట్టిన పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి తెలిపారు. మైలవరం మండలం పుల్లూరు రైతు భరోసా కేంద్రంలో వైఎస్సార్ యంత్ర సేవా కేంద్రం ద్వారా ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్, ఏఎంసీ చైర్మన్ అప్పిడి సత్యనారాయణరెడ్డి ఆధ్వర్యంలో పుల్లూరు గ్రామానికి రోటావేటర్స్, ట్రాక్టర్లను రైతు మిత్ర గ్రూపులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో పుల్లూరు పీఏసీఎస్ అధ్యక్షుడు చిలుకూరి రామకృష్ణారెడ్డి, గ్రామ స్తులు పాల్గొన్నారు.

భావవ్యక్తీకరణ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

తిరువూరు: విద్యార్థులు ఆంగ్లభాషలో మాట్లాడుతూ భావ వ్యక్తీకరణ నైపుణ్యాలను వృద్ధిపరచుకోవాలని ఆంగ్ల భాషోపాధ్యాయ సంఘ కన్వీనర్ రాంప్రదీప్ సూచించారు. స్థానిక నాగార్జున స్కూల్లో ఆంగ్లభాషలో ఉచిత శిక్షణా తరగతులకు విచ్చేసిన విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు ప్రాధాన్యతను మంగళవారం వివరించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అన్ని దేశాల్లో ఇంగ్లిష్ మాట్లాడేవారే అత్యధికంగా ఉన్నారని, భావ వ్యక్తీకరణకు ఆ భాషే కీలకమని కూడా రాంప్రదీప్ పేర్కొన్నారు.

భానుడు భగభగ



జనసంచారం లేక బోసిపోతున్న మైలవరం రోడ్డు



ఎండధాటికి తట్టుకోలేక తలపై కండువా కప్పుకొని వెళ్తున్న వ్యక్తి

పెరిగిన ఉష్ణోగ్రతలు

నూజివీడు: రోజురోజుకు భానుడు ఉగ్రరూపం దాల్చుతుండడంతో ప్రజలు అల్లాడుతున్నారు. నూజివీడు నియోజకవర్గం నిప్పుల కొలిమిలా మారుతోంది. రెవెన్యూ డివిజన్ కేంద్రం కావడంతో ప్రజలు పలు పనుల నిమిత్తం వస్తూ ఎండభారిన పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 15న 44.5 డిగ్రీల సెంటీగ్రేడ్‌తో హడలెత్తించిన భానుడు, రోజులు గడుస్తున్న కొద్దీ మరింతగా నిప్పులు చెరగడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. సాయంత్రం ఐదు గంటల వరకు జన సంచారం లేక రోడ్లన్నీ నిర్మానుష్యంగా ఉంటున్నాయి. వేడి గాలులకు ద్విచక్రవాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటలకే ఎండ సర్రుమనడంతో ఇంట్లో నుంచి బయటకు వచ్చేందుకు ప్రజలు హడలిపోతున్నారు.

జాగ్రత్తలతోనే ఆరోగ్యం



ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎండలో ఎంతమాత్రం తిర గకూడదు. గంట గంటకు నీరు తాగాలి. మధ్యా హ్న సమయంలో నీళ్లలో ఉప్పు, పంచదార వేసుకుని తాగాలి. దీని వల్ల చెమట రూపంలో నష్టపోయిన ఖనిజ లవణాలను భర్తీ చేయడానికి వీలవుతుంది. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే గొడుగు వేసుకుని వెళ్లడం కొంతవరకు నయం.

– ఆర్.నరేంద్రసింగ్, సూపరింటెండెంట్, నూజివీడు ఏరియా ఆస్పత్రి

జాగ్రత్త వహించాలి

తిరువూరురూరల్: వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా వడ దెబ్బకు గురికాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది మండలంలోని కాకర్ల, మల్లేల గ్రామాలలో మంగళవారం అవగాహన ప్రచారం నిర్వహించారు. పగటి ఉష్ణోగ్రత అధికంగా ఉన్నందున అవసరమైతేనే బయటికి రావాలని, ఎక్కువగా మంచినీరు తీసుకోవాలని ఆరోగ్యకార్యకర్తలు సూ చించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశా రు. డెండీ తదితర జ్వరాల బారిన పడకుండా దోమతెరలు ఉపయోగించాలని తెలిపారు.

రాజేంద్రకుమార్‌కు డాక్టరేట్



నూజివీడు: మండలంలోని సీతారామపురానికి చెందిన పర్వతనేని రాజేంద్రకుమార్‌కు అన్నామలై యూనివర్సిటీ పీహెచ్‌డీ డాక్టరేట్‌ను ప్రదానం చేసింది. ఈ అవార్డును కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగంలో రాజేంద్రకుమార్ అందుకున్నారు. 'ఆప్టిమైజేషన్ అసిస్టెడ్ ఏఐ బేస్డ్ మోడల్స్ ఫర్ హార్ట్ డిసీజ్ ప్రిడిక్షన్' అనే సాంకేతిక అంశంపై పరిశోధన చేసి ప్రచురించిన సిద్ధాంత గ్రంథాన్ని నిపుణుల కమిటీ పరిశీలన తరువాత డాక్టరేట్‌ను అందజేశారు. దీనికి సంబంధించిన పలు పరిశోధన పత్రాలు అంతర్జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి.

ఎన్టీటీపీఎస్‌లో సాంకేతిక సమస్య

ఇబ్రహీంపట్నం: ఎన్టీటీపీఎస్‌లో ఏర్పడిన సాంకేతిక సమస్య సంస్థ ఇంజనీర్లు గంటల్లో పరిష్కారానికి కృషి చేశారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతకు సోమవారం మధ్యాహ్నం 3.30గంటలకు స్విచ్‌యార్డ్‌లో ప్రొటెక్షన్ కరెంట్ ట్రాన్స్‌ఫార్మర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో 2,3,6,5 యూనిట్లలో 840 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయింది. తక్షణమే స్పందించిన ఇంజినీర్ల కృషితో రాత్రి 8గంటల లోపు అన్ని యూనిట్లలో విద్యుత్ ఉత్పత్తి ప్రారంభించారు. మంగళవారం 7వ యూనిట్ సాంకేతిక సమస్యతో నిలిచింది. దీంతో 500 మెగావాట్లు విద్యుత్ ఉత్పత్తి ఆగింది. ఇంజినీర్లు సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు సంస్థ అధికారులు తెలిపారు.

భీమరాజు గుట్టపై చెలరేగిన మంటలు



ఇబ్రహీంపట్నం: స్థానిక రింగ్ సెంటర్ సమీపంలో భీమరాజు గుట్టపై మంగళవారం తెల్లవారుజామున మంటలు చెలరేగాయి. వేసవి కాలం కావడంతో కొండపై మొక్కలు, గడ్డి ఎండిపోవడంతో మంటలు అన్ని వైపులా వ్యాపించాయి. గుట్టచుట్టూ ఆర్టీసీ బస్ డిపో, జాకీర్‌హుస్సేన్ కళాశాల, ఇళ్లు ఉన్నాయి. మంటలు కిందకి వ్యాపిస్తాయని ప్రజలు ఆందోళన చెందారు. స్థానికుల సమాచారంతో ఇబ్రహీంపట్నం, కొండపల్లి, మైలవరం ప్రాంతాల అగ్నిమాపక వాహన సిబ్బంది సకాలంలో చేరుకుని మంటలు అదుపుచేశారు. వీరికి సహాయకులుగా శ్రీను, ఏతాకులు రామారావు, సురేష్ మరికొంతమంది యువకులు పాల్గొన్నారు.

తపన సేవా కార్యక్రమాలు

ఆగిరిపల్లి: తపన ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుయ గారపాటి సీతారామాంజనేయ చౌదరి అన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రమైన ఆగిరిపల్లి శోభనాచల వ్యాఘ్రలక్ష్మీ నరసింహ స్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. చిలకపాటి కాంప్లెక్స్ వద్ద ఏర్పాటు చేసిన కూలింగ్ వాటర్‌ను ఆయన భార్య రేణుక చేతుల మీదుగా ప్రారంభించారు.

రైతులకు అవసరాలకు అనుగుణంగా విత్తనాలు

గంపలగూడెం: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశానుసారం వచ్చే ఖరీఫ్ సీజన్‌లో రైతుల అవసరాలకు అనుగుణంగా కావాల్సిన విత్తనాలను రైతభరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తామని వ్యవసాయాధికారి బీ సాయిశ్రీ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మంగళవారం ఎంపీపీ గోగులమూడి శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయశాఖపై సమీక్ష సందర్భంగా ఏఓ మాట్లాడుతూ 50శాతం సబ్సిడీపై జీలుగ, పిల్లిపెసర విత్తనాలు సరఫరా చేస్తున్నట్లు వివరించారు. జెడ్పీటీసీ సభ్యుడు కోట శామ్యూల్ మాట్లాడుతూ జిల్లా పరిషత్ నిధులతో మండలంలోని ఐదు గ్రామాల్లో మంజూరైన గ్రావెల్ రోడ్లను వెంటనే పూర్తి చేయాల్సి ఉందన్నారు. మండల పరిషత్ నిధులతో మంజూరైన బోర్ల తవ్వకం పూర్తి చేసి నీటి సమస్య లేకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. గృహనిర్మాణశాఖ ఏఈ మాట్లాడుతూ పీఎంఏవై గ్రామీణ స్కీమ్‌లో 2021–22లో 570 గృహాలు, నవరత్నాలు పేదలందరీ ఇల్లులో భాగంగా జగనన్న లేఅవుట్‌లలో 270 గృహాలు మంజూరయ్యాయని వివరించారు. సొంత స్థలాల్లో నిర్మించుకునేందుకు సిద్ధంగా ఉన్న 1,956మందికి ఎలిజిబుల్ లిస్ట్ వచ్చిందని, దీనిపై డీపీఆర్ రిపోర్ట్ తయారు చేస్తున్నామన్నారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణానికి సిద్ధం కావాలన్నారు. ఎంపీపీ జీ శ్రీలక్ష్మి మాట్లాడుతూ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.1.30 కోట్లతో రహదారులు, శ్మశానాల అభివృద్ధి, తాగునీటి వసతి కల్పన చేయడం జరిగిందన్నారు. ఎంపీడీఓ వై పిచ్చిరెడ్డి, డెప్యూటీ తహసీల్దార్ రాధికా రాణి పాల్గొన్నారు.

అందుబాటులో పచ్చిరొట్ట విత్తనాలు

రెడ్డిగూడెం: మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో జీలుగు, జనుము, పచ్చిరొట్ట పైరు విత్తనాలు 50శాతం సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఆర్ సురేష్ మంగళవారం తెలిపారు. జీలుగు విత్తనాలు కేజీ రూ.79లు కాగా 50శాతం సబ్సిడీపై రూ.39.50కు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఎకరాకు 10 కేజీల విత్తనాలు సరిపోతాయని తెలిపారు. జనుము విత్తనాలు కేజీ పూర్తి ధర రూ. 84 కాగా 50 శాతం సబ్సిడీపై రూ. 42కు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎకరాకు 10 కేజీలు సరిపోతాయని తెలిపారు. మండల పరిధిలోని పట్టాదారు పాస్ పుస్తకాలు కలిగిన రైతులు ఆధార్ ద్వారా ఈకేవైసీ చేసుకుని విత్తనాలు పొందవచ్చని పేర్కొన్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతికి సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రక్షణనిధి

గంపలగూడెం: ప్రజలకు మంచి చేయాలన్న తలంపుతోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అభివృద్ధి, సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కే రక్షణనిధి అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల్లో నూరుశాతం అమలు చేసిన ఘనత దేశంలోనే ఒక్క వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మాత్రమే దక్కుతుందన్నారు. దీంతో పార్టీ పట్ల ప్రజల్లో నానాటికీ పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే 2024 ఎన్నికల్లో ఓటర్లు మరోపర్యాయం వైఎస్సార్ సీపీని గెలిపించాల్సి ఉందన్నారు. గంపలగూడెం సచివాలయం-1 పరిధిలోని రామ్మోహన్‌సెంటర్ నుంచి కుమ్మరబజారు, రెడ్డిబజారు, షిర్డీసాయిబాబా ధ్యానంనిలయం ఏరియా, రజకపేటల్లో ఆయన మంగళవారం గడప గడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరిస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ప్రజలు ఆయన దృష్టికి తెచ్చిన సమస్యలను పరిష్కరించాలని అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. గడచిన నాలుగు సంవత్సరాలుగా సంక్షేమ పథకాల కింద లబ్ధిదారులకు అందిన సంక్షేమం వివరించి, ముద్రించిన బ్రోచర్లను పంపిణీ చేశారు. ఎంపీపీ జీ శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కే శామ్యూల్, ఎంపీటీసీ సభ్యురాలు కే లావణ్య, పీ రజని, సొసైటీ మాజీ అధ్యక్షుడు అల్లు కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు సీహెచ్ వెంకటేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు కే నరశింహారావుపాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రక్షణనిధి

ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్య

తిరువూరు: తమ కళాశాలలో ఇంటర్మీడియట్ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తున్నామని, తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ కళాశాలలో చేర్చాలని తిరువూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ మురళీకృష్ణ కోరారు. నూతన విద్యా సంవత్సరంలో అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా పట్టణంలో మంగళవారం కరపత్ర ప్రచారం నిర్వహించారు. ప్రైవేటు కళాశాలలకు దీటుగా గత విద్యాసంవత్సరంలో తమ కళాశాల గణనీయమైన ఫలితాలు సాధించిందని, ఒకేషనల్ కోర్సులు చదివిన విద్యార్థులు సచివాలయాల్లో ఉద్యోగాలు పొందారని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎటువంటి ఫీజు చెల్లించనవసరం లేకుండా విద్యార్థులు ఉచిత విద్యనభ్యసించవచ్చన్నారు. అమ్మ ఒడి, ఉచిత పాఠ్య పుస్తకాల వంటి సదుపాయాలు లభిస్తాయన్నారు. ప్రచారంలో అధ్యాపకులు పాల్గొన్నారు.



తిరువూరులో ప్రభుత్వ కళాశాల అడ్మిషన్లకు ప్రచారం

వేసవి స్కూళ్లుగా గ్రంథాలయాలు

నూజివీడు: స్థానిక ప్రథమశ్రేణి గ్రంథాలయంలో మంగళవారం వేసవి ఉచిత శిబిరం నిర్వహించారు. విశ్రాంత ఉద్యోగి ఎం.విశ్వేశ్వరరావు విద్యార్థులకు యోగాపై అవగాహన కల్పించడంతో పాటు వారితో యోగా చేయించారు. ఈ సందర్భంగా విశ్వేశ్వరరావు మాట్లాడుతూ యోగా వల్ల మానసికంగా, శారీరకంగా ఆరోగ్యంగా ఉంటారన్నారు. జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి వేములపల్లి రవికుమార్ నూజివీడు గ్రంథాలయంలో వేసవి క్యాంప్‌ను సందర్శించారు. గ్రంథాలయాలు వేసవి స్కూళ్లుగా మారాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను గ్రంథాలయాలకు పంపి వారి విజ్ఞానం పెరిగేందుకు తోడ్పాటునందించాలని రవికుమార్ కోరారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.



నూజివీడు గ్రంథాలయంలో విద్యార్థులకు యోగాపై శిక్షణ

మహనీయుల జీవితం స్ఫూర్తి

మండలంలోని గొల్లపల్లి గ్రంథాలయంలో మంగళవారం సమ్మర్ క్యాంప్‌ను నిర్వహించారు. దీనిలో పాల్గొన్న గొల్లపల్లి హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు కె.మోహన్‌రావు పిల్లలకు పుస్తకపఠనం, నీతికథల వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రైతు భరోసా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకోండి

చాట్రాయి: పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ పేర్లను ఆయా గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రంలో నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 50 శాతం సబ్సిడీతో పిల్లి పెసర్లు, జనుము, జీలుగ విత్తనాలు అందిస్తామని చెప్పారు. మొక్కజొన్న అమ్మే రైతులు ఈ నెల 17వ తేదీ లోగా తమ పేర్లను కొనుగోలు కేంద్రాల్లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

విస్సన్నపేటలో..

విస్సన్నపేట: ఉద్యాన పంటలు సాగు చేస్తున్న రైతులు బిందుసేద్యం కావాల్సిన వారు ఆర్బీకేలలో నమోదు చేయించుకోవాలని ఏఓ రాజ్యలక్ష్మి మంగళవారం పేర్కొన్నారు. మండలంలో 2022–23 సంవత్సరంలో బిందుసేద్యం భౌతిక లక్ష్యం 1,500 హెక్టార్లు కాగా 1,800 హెక్టార్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 2023–24 సంవత్సరంలో రెండు వేల హెక్టార్లు భౌతిక లక్ష్యంగా కేటాయించారు.

నీలకంఠేశ్వరస్వామికి రేపు అన్నాభిషేకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): అయోధ్యనగర్ శ్రీ దత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో ఈనెల 18వ తేదీ గురువారం శ్రీధర్మపరిషత్ మహాసంస్థానమ్ ఆధ్వర్యాన మాసశివరాత్రి సందర్భంగా స్వామివారికి అన్నాభిషేకం, విశేష అర్చనలు నిర్వహించనున్నట్లు పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అధ్యాపకురాలికి పీహెచ్‌డీ ప్రదానం

మైలవరం: స్థానిక లకిరెడ్డి బాలిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగం అధ్యాపకురాలు టీ నాగదుర్గ పీహెచ్‌డీ అవార్డు అందుకున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు మంగళవారం తెలిపారు. అధ్యాపకురాలు నాగదుర్గ జేఎన్‌టీయూ, కాకినాడ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ విభాగంలో 'ఛింప్ ఆప్టిమైజేషన్ బేస్డ్ ఆప్టిమల్ గ్రిడ్ కనెక్టెడ్ సోలార్ ఫోటోఓల్టాయిక్ సిస్టమ్ విత్ ఎన్‌హాన్స్‌డ్ పవర్ క్వాలిటీ ఫీచర్స్' అనే అంశంపై చేసిన పరిశోధనకు పీహెచ్‌డీ ప్రదానం చేశారన్నారు. ఈ పరిశోధనను వీఆర్ సిద్దార్థ కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ పీ.వీ.ఆర్.ఎల్ నరసింహం , జెఎన్‌టీయూజీవీ, ఈఈఈ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ వీ. ఎస్. వకుళ పర్యవేక్షణలో జరిగిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అవార్డు పొందిన అధ్యాపకురాలు నాగదుర్గను కళాశాల ప్రెసిడెంట్ జీ. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ అప్పారావు, ఈఈఈ విభాగాధిపతి డాక్టర్ జే. శివ వర ప్రసాద్ అభినందించారు.